



# ఏడు ఉత్తరాల కథ

ధూపాటి సంపత్కుమారాచార్య

## 1

సంపాదక మహాశయా !

10—1—69

నమస్కారములు

మీకు లోగడ చాలాసార్లు శుభాకాంక్షలు పంపాను. పోతే నేను రాసిన కథలు రాసినట్లుగా మీకు ఎప్పటినుంచో పంపుతున్నాను. పంపినవి పంపినట్లే వెనక్కి త్రిప్పి పంపుతున్నారు. త్రిప్పి పంపటానికి స్టాంపులంటించి పంపటంవల్ల నేమో ! యిక స్టాంపులు అంటించకుండానే ఈ కథ పంపుతున్నాను, దయచేసి ప్రచురింపగలరు.

భవదీయుడు
ఉత్తరాలరావు.

## 2

సంపాదక మహాశయా !

10—2—69

నా కథ మళ్ళీ త్రిప్పి పంపబడింది. స్టాంపులు పెట్టకపోయినా ! అంచాత తేలిందేమిటంటే నా పేరు కన్పిస్తే చాలు త్రిప్పిపంపే కథలు మాత్రమే రాసే రచయితగా నాకు ముద్రవేసినట్లున్నారు. ఈ దఫా అన్నా దయయుంచి యీ ఒక్క కథా ప్రచురించండి. దీన్ని ప్రచురించాలని ఆంధ్రప్రదేశ్‌లోని అందరు దేవుళ్ళకీ మొక్కుకున్నాను.

ఉంటాను మరి
ఉత్తరాలరావు.

## 3

మహాశయా !

మీకు ఉత్తరాలు రాసినా లాభం లేకపోయింది. మీరింత నిర్దాక్షిణ్యంగా ఎందుకు వ్యవహరిస్తున్నారో తెలీకుండా వుంది. దయయుంచి యీ కథ ప్రచురించండి. లేదా నేను కోర్టుకు పోతాను. ఇప్పటికి మీకు పంపిన కథల సంఖ్య దస్తా ! అవి వ్రాయటానికి నాకు ఖర్చయిన కాగితాల సంఖ్య బస్తా !

ఉంటాను మరి
ఉత్తరాలరావు.

## 4

మహాశయా !

9—3—69

ఇన్నాళ్ళకు నా కలలు పండాయి. మీరు ఎట్టకేలకు నా కథ ఒకటి ప్రచురించారు. వెంటనే ఆ పత్రిక కొనేసి త్వరగా మా ఆఫీసరుకు చూపించి కంగ్రాట్యులేషన్స్ అన్పించుకొన్నాను. పత్రిక మాత్రం మళ్లీ యివ్వలేదు. చూసి యిస్తానని మాత్రం చెప్పాడు. ఇంకో కాపీ కొన్నాను. మా ఆఫీసు స్టాఫ్‌కిస్తూ ఆనందమ్మోలో కిద్దామని. నా చేతిలోని పత్రికను అమాంతం అరడజను మంది కత్తుల రత్తయ్యలూ రావణాపులు ఎగబడి గుంజుకొన్నారు. ఏమైనా నేను వదలకపోవటంతో మీ పత్రిక ముఖచిత్రాన్నొకరూ, విడివిడి కాయితాలు మరొకరూ చింపుకొని పోయారు. ఆఖర్కు వాళ్ళ

నా స్నేహితులే అనుకోండి. అయినా పత్రికకొని చదివే తెలివి మనవాళ్ళలో పెరగలేదు ఏమంటారూ?

కథ మా శ్రీమతికి చూపుదామంటె పిలుపడలేదు. దయచేసి నా కథపడ్డ కాపీ ఒకటి పంపించరూ! ఈ ఊళ్లో పర్కులేషన్‌కి వచ్చినవన్నీ కొనేశాను. ఇక దొరకవు మరి.

ఉంటాను, సెలవు.
(మీ) (మా) పత్రిక రచయిత
ఉత్తరాలరావు.

తాజాకలం : తిరుపతి వెంకన్న ముడుపు యివాళే పోస్టుచేశాను. సత్యనారాయణ వ్రతం చేసికొన్నాము.

## 5

మహాశయా

10–4–69

నా కథ పడి చాలారోజులైంది. తర్వాత నే వ్రాసిన కథలు అపరిమితం అయినా వాటి గోడెవరు పట్టించుకుంటారూ? మీరు ప్రచురించిన కథలకి పారితోషికం పంపుతారని ఇక్కడందరూ చెబుతున్నారు. నేను రోజూ పోస్టుమ్యాన్ కోసం ఎదురు చూస్తున్నాను. ఈ సంగతి మీకురాస్తే యిక మీరు నా కథలు ప్రచురించరని మా ఆవిడ బెదిరిస్తోంది.

కనీసం నాకు పారితోషికంగా ఒక్క ఉత్తరం ముక్కచాలు.

ఉత్తరాలరావు.

## 6

అయ్యా ఉత్తరాల రావుగారూ!

20–4–69

మీరు వ్రాసిన కథ 'తొడిమలేని పూవు' గురించి, జెకోస్లవేకియా, అమెరికాలలోని పాఠకులు ప్రశంశిస్తూ ఉత్తరాలు రాశారు. కాని కొందరు పాఠకులు 'పూవులేని తొడిమ' అనే కథను మా పత్రికలో రెండు సంవత్సరాల క్రిందట ప్రచురించిన దాన్ని కృతఘ్నుంగారిరచననూ, మీ కథనూ కాపీలు పంపుతూ 'కృతఘ్నుంగారి కథను మీరు మక్కీకి మక్కీగా దొంగిలించారు' అని ఆరోపించారు. పాఠకులు చాలా తెలివైన వారుంటారు.

పోతే మీ కథా ప్రచురణ గురించిన వివరాలు యివ్వడలిస్తున్నాం! ఆ కథ ఒక ఉపసంపాదకునికిచ్చి త్రిప్పిపంపించమని చెప్పాం. ఆయనగారి కుడిచెవ్వి దగ్గర ఒకటి ఎడమ చెవ్విదగ్గరఇంకోటి చొప్పున ఆటంబాంబులు పేల్చినా ఆయనకు చీమ కదిలినప్పుడు చప్పుడుకానట్టే ఏమీ విన్పించనంత చెవుడుంది. అంచాత ఆయన ఆ కథను మా ప్రెస్‌కి పంపేసి వూరుకున్నాడు. 'ముందు పంపారా?' అని మేం అడిగితే వనిగట్టుక పోయి మా పత్రికలో ముందు కథగా వేసి పారేసెయ్యమని చెప్పార్ట ప్రెస్సులో.

అంచాత మీరు (రాయని) ఆ కథకు పారితోషికం ఆశిస్తున్నారని తెల్సింది. అయినా మేమా కథకు శ్రీ కృతఘ్నుంగారికే పంపాము. వారు స్వర్గీయులైనారని తెల్సినా గూడా!

మీరు యికనుంచి స్వంతరచనలు చేయటం చాలా అవసరం! ఇక ముందు (మా) (మీ) పత్రిక మీ రచనలు ఏవి ప్రకటించవదని మనవి.

సంపాదకుడు
కథాగుళిక.




షికాకాయ్
భారత స్త్రీల
అందమైన జుట్టుకు
పారంపర్యమైన రహస్యము




స్వస్తిక్
షికాకాయ్
షాంపూ సబ్బు
పారంపర్యత, సౌఖ్యముల కలయిక
—మీ కుటుంబ ఉపయోగమునకు
ఒక ఆధునికమైన సబ్బు బిళ్ల.

SHILPI-HEMA-9A/72 TEL

# ఏడు ఉత్తరాల కథ

## 7

సంపాదక మహాశయా!

తేది: 20-5-1969

ఇది ఆఖరి వుత్తరం. నా కథ ఇతర దేశాలవాళ్ళు చదివారు గాబట్టి అంతర్జాతీయ ఖ్యాతి నందింది. పోతే కథా దొంగతనం గురించి....

నేనీ కథను లోగడనే గత కొన్ని సంవత్సరాలక్రిందట వ్రాశాను. తీగ కదిలిస్తే డొంకంతా కదులుతుంది. శ్రీయుత కృతఘ్నంగారి కుమార్తె వరాహలక్ష్మి మైత్రి నాకుండే పరిచయంవల్ల నేనామెకు ఆ కథ యిచ్చి కృతఘ్నంగార్ని సరిచేసి పంపవలసిందిగా కోరాను వారు ఎన్నాళ్ళకీ నాకు జబాబు యివ్వకపోటంతో నేను ఆ కథ కాపీ నా దగ్గరుంటే నేను పంపించాను, ఎలాగూ త్రిప్పి పంపుతారనే నమ్మకంతో!

ఇకముందునుంచి నా కథలు ప్రచురించబోయేముందే, మీ పాతసంచికలు తిరిగేయటం ముఖ్యం!

శెలవు

ఉత్తరాలరావు.

పాఠకులకి మనవి.

శ్రీయుత కృతఘ్నంగారు చాలా సంవత్సరాలక్రిందట వ్రాసిన 'తొడిమలేని పువ్వు' అన్నకథని శ్రీ ఉత్తరాలరావుగారు 'పువ్వులేని తొడిమ' అనే పేరుతో పంపారు. రెండు కథలు మా (మీ) పత్రికే ప్రకటించింది. అసలు రచయిత శ్రీ కృతఘ్నంగారా! ఉత్తరాలరావా? అన్న సమస్య తేలక మేం యిద్దరికీ ఉత్తరాలు రాశాం. శ్రీ కృతఘ్నంగారు స్వర్గస్థులై వుండటంవల్ల పోస్టువాళ్ళు ఆ వుత్తరాన్ని ఎక్కడికో 'రీడైరెక్టు' చేశారట! ఇలా 'కథ' ఒక్కటే ఇద్దరు రచయితలుండటం దురదృష్టం. ఇకముందునించి ఇలాంటివి జరగకుండా చూడగలం!— ఈ ఉత్తరాల మూలంగా మా సర్క్యులేషన్ పెరిగింది. కథా దొంగతనాన్ని పట్టియిచ్చిన డిటెక్టివ్ పాఠకులకు కృతజ్ఞాలం — ఇక దీనిపై ఉత్తరప్రత్యుత్తరాలు జరగవు.

సంపాదకుడు